www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 05 | జనవరి | 2026 పేజీలు : 8

## సీతమ్మ సాగర్ భూముల్లో అక్రమ రహదారి



**-అనుమతులు లేకుండానే నిర్మాణం**

**ప్రజాపక్షం/చర్ల :** సీతమ్మ సాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్టుకు సర్వే నిర్వహించి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించారు. పరిహారం చెల్లించిన భూముల్లో ఇసుక రవాణా కోసం అక్రమంగా రహదారిని నిర్మించిన అధికారులు చోద్యం చూస్తున్న ఘటన చర్ల మండలంలో చోటు చేసుకుంది. గోదావరి నదిపై సీతమ్మ సాగర్ నిర్మాణం కారణంగా ముంపుకు గురవుతున్న భూములను గుర్తించి పరిహారం ఇచ్చారు. అయితే పరిహారం ఇచ్చిన తర్వాత అవి ప్రభుత్వ భూములే అటువంటి భూముల్లో రహదారి నిర్మించారు. ఏజెన్సీ చట్టాల ప్రకారం కానీ ప్రభుత్వ భూ నిబంధనల ప్రకారం కానీ ఈ రహదారి నిర్మాణం పూర్తిగా చట్ట విరుద్ధం తేగడ ఇసుక క్వారీకి సంబంధించి రేంజింగ్ కాంట్రాక్టర్లు తేగడ సమీపంలోని

మిగతా 2లో..

# సంపద కోసమే వెనిజులాపై దాడి




**-అమెరికా వైఖరిపై దేశ వ్యాప్త నిరసనలు**
**-కార్పొరేట్ల కోసమే ఎన్ఆర్ఈజిఎస్‌లో మార్పు**
**-సభకు వెళ్లకపోతే రాజీనామా చేయాల్సిందే**
**-18న చారిత్రిక సభ**
**-మీడియా సమావేశంలో సిపిఐ నేత నారాయణ**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సంపద కోసమే అమెరికా వెనిజులాపై దాడి చేసిందని ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వాలపై ట్రంప్ దాడి చేయటాన్ని యావత్ ప్రజలు ఖండించాలని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డా॥ కె. నారాయణ కోరారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు పస లేనివని వెనుజులాలోని ఆయిల్ సంపదను తమ వశం చేసుకునేందుకే ట్రంప్ వెనుజులా అధ్యక్షున్ని, ఆయన భార్యను బంధీలుగా చేశారన్నారు.

మిగతా 2లో..

## మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

**-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**
**-ఏదులాపురం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** పేదలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని, రాష్ట్ర రెవెన్యూ,గృహనిర్మాణం సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీలో ముమ్మరంగా పర్యటించారు. టెంపుల్‌సిటిలో రూ.33లక్షల90వేలు, చిన్నతండలో రూ.20లక్షల33 వేలు, సూర్యానగర్‌లో రూ.24లక్షల87వేలు, నాల్గవతరగతి ఉద్యోగుల కాలనీలో రూ.24 లక్షల 87వేలతో నిర్మించనున్న సీసీరోడ్ల నిర్మాణపనులకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఏదులాపురంమున్సిపాలిటీలో గత రెండు సంవత్సరాలలో 56కోట్ల అభివృద్ధి పనులు మంజూరు చేశామన్నారు. అలాగే 14కోట్ల రూపాయాలతో వివిధ మౌలిక వసతుల కల్పన పనులు పూర్తి చేశామన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాలు అందిచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. రాబోయే ఏప్రిల్ నెలలో

మిగతా 2లో..

## 18న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయండి



**సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/మణుగూరుః** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల ముగింపు వేడుకలు ఈనెల జనవరి 18వ తేదీన ఖమ్మంలో ఐదు లక్షల మందితో జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని సిపిఐ పురిటి గడ్డైన మణుగూరు నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున ఖమ్మం తరలిరావాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. ఆదివారం అశ్వాపురం నుండి మణుగూరుకు

మిగతా 2లో..

## త్యాగాలకు చిరునామా పోటు కుటుంబం




**-తుదిశ్వాస వరకు ప్రజల పక్షాన నిలిచిన ప్రసాద్**
**-ఐక్య ఉద్యమాలే ప్రసాద్‌కు సరైన నివాళి**
**-పోటు ప్రసాద్ వర్ధంతి సభలో నారాయణ, కూనంనేని, జూలకంటి, పోటు తదితరులు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో త్యాగాలకు చిరునామాగా పోటు ఎర్రమ్మ కుటుంబం నిలిచిందని ఎర్రమ్మ, రాఘవయ్య, పోటు ప్రసాద్, రమేష్ తదితరులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్బంధాలను లెక్కచేయక పోరాడారని వామపక్ష నేతలు తెలిపారు. ఖమ్మం జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభ ఆదివారం ఆయన స్వగ్రామం గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామంలో జరిగింది. సూర్యాపేట జిల్లా కార్యదర్శి బేజవాడ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ నారాయణ మాట్లాడుతూ మునగాల పరగణ చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని అటువంటి ప్రాంతంలో పోటు ప్రసాద్ కుటుంబం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తుదికంత పోరాడుతుందన్నారు. నాడు సాయుధ పోరాట కాలంలో పోటు ఎర్రమ్మను పోలీసులు చిత్ర హింసలు పెట్టారని కమ్యూనిస్టు నాయకునిగా ఉన్న పోటు రాఘవయ్యను హతమార్చేందుకు ఈ గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ లేకుండా చేసేందుకు అనేక ప్రయత్నాలు చేశారని దాడులతో భయ కంపితులను చేసిన తాము ఎత్తిన ఎర్ర జెండాను దించ లేదన్నారు. పోరాట వారసునిగా, విద్యార్థి ఉద్యమాలతో ప్రారంభమైన పోటు ప్రసాద్ రాజకీయ జీవితం కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి వరకు ఎదిగిందని విద్యార్థి, కార్మిక, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా అనేక ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారన్నారు. నిజాయితీకి, నిబద్ధతకు మారుపేరుగా నిలిచిన పోటు ప్రసాద్ మరణం యావత్ కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటన్నారు.

మిగతా 2లో..

# ప్రజా సమస్యలపై పోరాడేది సిపిఐ

**-సిపిఐ శత వసంతాల ముగింపు సభను జయప్రదం చేయండి**
**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి**

సెంటర్‌స్ప్రెడ్



# సంపద కోసమే వెనిజులాపై దాడి

(మొదటిపేజీ తరువాయి)

ఆదివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ వెనుజులాలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం ఉందని చర్చించే అవకాశం ఉన్నా ఆ పని చేయకుండా ట్రంప్ ప్రపంచ పోలీస్‌గా వ్యవహరిస్తున్నాడని ఆరోపించారు. గతంలో అణు ఆయుధాల పేరు చెప్పి ఇరాక్‌పై దాడి చేసి సద్దాం హుస్సేన్‌ను చంపేశారని ఆ తర్వాత అణు ఆయుధాల గురించి ఎందుకు వెల్లడించడం లేదని నారాయణ ప్రశ్నించారు. వెనిజులాపై దాడి భారత దేశానికి నష్టమని దీనిపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఆయిల్ ఎగుమతిని అడ్డంపెట్టుకుని భవిష్యత్తులో అమెరికా ఒత్తిడి తెచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రజాస్వామ్య దేశాలపై విదేశీ శక్తులు దాడి చేసే హక్కు లేదన్నారు. బిజెపి, గాంధీ, నెహ్రూలను చరిత్ర నుండి చెరిపివేయాలని చూస్తుందన్నారు. కార్పోరేట్ సంస్థల కోసమే కమ్యూనిస్టులు పోరాడి సాధించిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మార్పు చేయడం వెనక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. గాంధీజీని భౌతికంగా చంపేసిన సంఘ్ పరివార్ అనుకూలురు ఇప్పుడు గాంధీ పేరు మార్చారన్నారు. 40 కుటుంబాల కోసం 28 లక్షల కోట్ల రూపాయల రాయితీ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం 85 కోట్ల మందికి 10 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు జంకుతుందని ఆయన తెలిపారు. 40 శాతం రాష్ట్రాలు భరించడం సాధ్యం కాదని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు ఎత్తేశాయని తెలిపారు. జిఎస్టి రూపంలో దోపిడీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వెంటనే ఎన్‌ఆర్‌ఈజిఎస్ పథకం మార్పును ఉపసంహరించుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు సమర్థింపుతో ఉన్న కేంద్ర ప్రభుత్వాన్ని దెబిరించడం సరికాదని నిధుల కోసం డిమాండ్ చేయాలన్నారు. మూసీనది కలుషితంపై వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సిపిఐ ఆందోళన చేసిందని మూసీ ప్రక్షాళన ఇండ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. శాసన సభను బైకాట్ చేసిన వారు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను చర్చించకుండా వేతనాలు పొందటం ఎలా సాధ్యమవుతుందన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంచాయతీ తగదని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చుని చర్చించాలని కోరారు. పోలవరం, బసకచర్ల సాధ్యం కాదని చంద్రబాబు నాయుడు, రేవంత్‌రెడ్డి ల గురుశిష్యుల కథ ముగిసిందన్నారు. తెలంగాణకు ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామాలను వదిలివేయాలని దీని వల్ల రెండు రాష్ట్రాలకు నష్టం లేదన్నారు.

### జనవరి 18న చారిత్రిక సభ...

జనవరి 18న సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా చారిత్రిక సభ జరుగుతుందని నారాయణ తెలిపారు. లక్షలాది మందితో జరిగే ఈ సభలో దేశ విదేశీ ప్రతినిధులు హాజరు కానున్నారని 15 రోజుల పాటు ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సభలు, సమావేశాలు, సదస్సులు జరుగుతాయన్నారు. కమ్యూనిస్టులు పురోగమించక తప్పదని మతోన్మాద శక్తులను అడ్డుకునే శక్తి కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. కమ్యూనిస్టులను అంతం చేయడం, సిద్ధాంతాన్ని కనుమరుగు చేయడం ఎవరి తరం కాదన్నారు. మతోన్మాదులకు కమ్యూనిస్టులంటే భయమని నారాయణ తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే భూ పంపిణీ జరిగిందని, ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని ఆయన తెలిపారు. కమ్యూనిస్టులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు,జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగాలకు చిరునామా పోటు కుటుంబం





(మొదటిపేజీ తరువాయి)

పోటు ఎర్రమ్మ, పోటు రాఘవయ్య వారసులంతా ఎర్రజెండా నీడన పని చేయడం అభినందనీయమని నారాయణ తెలిపారు. మావోయిస్టులను చంపినంత మాత్రానా, నిర్బంధాలకు గురి చేసినా కమ్యూనిస్టు సిద్ధాంతం మాసిపోదని నారాయణ తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఆయన తెలిపారు. ప్రాధాన్యత అంశాలపై ఐక్య పోరాటాలే పోటు ప్రసాద్‌కు సరైన నివాళి అన్నారు. సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పోటు ప్రసాద్ పోరాట అగ్నికణమని పార్టీకి అంకితమైన కుటుంబం పోటు ప్రసాద్ ది అన్నారు. ఎన్ని నిర్బంధాలు ఎదురైనా వెనకడుగు వేయని ధైర్యశాలి పోటు ప్రసాద్ అన్నారు. వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఖమ్మంలో జరిగే చారిత్రిక సభను పోటు ప్రసాద్‌కు అంకితమిస్తున్నామన్నారు. పోటు ప్రసాద్ తనకంటూ ఓ చరిత్రను మిగిల్చుకుని వెళ్లారని ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయడమే మనందరి కర్తవ్యం కావాలన్నారు. మతోన్మాద శక్తులు పెచ్చరిల్లుతున్నాయని కమ్యూనిస్టులు మాత్రమే మత శక్తులను అడ్డుకోగలరని అందుకు కమ్యూనిస్టు కార్యకర్తలు సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎంఎల్‌ఎ జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య రచించిన వీర తెలంగాణ పోరాటం పుస్తకంలో పోటు ఎర్రమ్మ కుటుంబం గురించి రాశారని ఇక నిబద్ధత కలిగిన కుటుంబమన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టులు మరింత బలపడాలని ఫాసిస్టు శక్తులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని మీడియాను, సంపదను తమ చేతుల్లో పెట్టుకుని ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నాయన్నారు. దేశానికి కమ్యూనిస్టులే రక్ష అని రంగారెడ్డి తెలిపారు. మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ చిన్నతనం నుంచి పోటు ప్రసాద్ ధైర్య సాహసాలతో ఉండేవాడని వారి కుటుంబం త్యాగాలకు నెలవుగా మారిందన్నారు. ప్రపంచ పరిస్థితులు దేశ పరిస్థితులను చూస్తుంటే ఆందోళన కలుగుతుందని ఇటువంటి సమయంలో ప్రసాద్ లాంటి వ్యక్తులు మరణించడం బాధకరమే అయినా వారి స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, సిపిఐ, సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శులు దండి సురేష్, నున్నా నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించగా వివిధ పార్టీల నేతలు మాజీ ఎంఎల్‌ఎ గుమ్మడి నర్సయ్య, మల్లు నాగార్జునరెడ్డి, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, నారాయణరెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, పోటు కళావతి, పోటు సక్కుబాయి, పోటు సాత్విక్, పోటు పూర్ణ, పోటు ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు స్థానిక సర్పంచ్ కట్టా కళ్యాణి, కడియాల అప్పయ్య తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు పోటు ప్రసాద్ స్మారక స్తూపాన్ని నారాయణ, కూనంనేని సాంబశివరావు, రంగారెడ్డి తదితరులు ఆవిష్కరించారు.

# గ్రామీణ వైద్యుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలి



**ప్రజాపక్షం/కామేపల్లి:** రాష్ట్రంలో గ్రామీణ వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తమను గుర్తించి ట్రైనింగ్ ఇవ్వాలని గ్రామీణ వైద్యుల సహాయక సంఘం జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మండలంలో కొత్త లింగాలలో జరిగిన గ్రామీణ వైద్యుల సహాయక సంఘం మండల 26వ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఏ చిన్న వైద్య సహాయం వచ్చిన మొట్టమొదటిగా ప్రథమ చికిత్స చేసేది గ్రామీణ వైద్యులేనని తెలిపారు. అంతే కాకుండా గ్రామాల్లో అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా ప్రజల ఇంటికి వెళ్లి వారికి ప్రథమ చికిత్స సేవలు అందించే తమను అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. తమకు కనీస భద్రత కల్పించాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, తమ సేవలను గుర్తించి ప్రభుత్వం ద్వారా అధికారిక గుర్తింపు ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణాచారి, జిల్లా ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి ఎ అమృతరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు బందెల నాగేశ్వరరావు, లేతాకుల మహబూబ్ రెడ్డి, మండల నాయకులు డి రాము, ఆర్ అప్పారావు, జి రమేష్, ఏడుకొండలు, శ్రీనివాస్, సతీష్, నాగ శంకర్, రాంబాబు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

మరో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వం ప్రారంభిస్తుందన్నారు. ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ఉంటుందన్నారు. నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీలో గతంలో వచ్చిన వరదలు దృష్ట్యా ప్రభుత్వం నష్టపోయిన కుటుంబాలకు కొంత సహాయం చేశామని భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రూ.580కోట్లతో మున్నేరు నదికి రిటైనింగ్ వాల్ యుద్ధ ప్రాతిపదికన రాబోయే వర్ష కాలం నాటికి పూర్తి చేస్తామన్నారు. సన్న బియ్యం పంపిణీ, నూతన రేషన్ కార్డుల పంపిణీ, పేదల గృహాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, ఆర్టీసి బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, గురుకులాల్లో విద్యార్థులకు డైట్ ఛార్జీలు 40శాతం, కాస్మోటిక్ ఛార్జీలు 200శాతం పెంపు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాలలో సిపిఐ సునీల్‌దత్, ఆర్‌అండ్‌బి ఎస్‌ఇ యాకుబ్, ఇర్రిగేషన్ ఎస్‌ఇ ఎం, వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారులు పుల్లయ్య, హౌజింగ్ పిడి భూక్య శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, పాలేరునియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ భైరు హరినాథ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బరావు, తమ్మినేని నవీన్, భూక్య సురేష్‌నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, వెంపటి రవి, బానోత్ భాస్కర్, కిషోర్, హరి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీతమ్మ సాగర్ భూముల్లో అక్రమ రహదారి

(మొదటిపేజీ తరువాయి)

తాలిపేరు ఒడ్డు నుంచి ఎర్రగడ్డ గ్రామం వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేర అక్రమ గ్రావెల్ రహదారిని నిర్మించారు. కేవలం ఇసుక రవాణా కోసమే ఈ రహదారిని నిర్మించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఈ భూములు నీటిపారుదల శాఖ ఆధీనంలో ఉన్నాయి. భూ సేకరణ చట్టం 2013 సెక్షన్ 24 ప్రకారం పరిహారం చెల్లించిన భూములు నిర్దిష్టమైన ప్రజా ప్రయోజనానికి మాత్రమే వినియోగించాలి. నీటిపారుదల శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక కాంట్రాక్టర్లు అక్రమ రహదారిని నిర్మించారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో పెసా చట్టం 1996 ప్రకారం రహదారి నిర్మించాలంటే గ్రామసభ తీర్మానం తప్పనిసరి. కరకట్ట నిర్మాణానికి కేటాయించిన భూముల్లో అక్రమ రహదారి వల్ల భవిష్యత్తులో కరకట్ట నిర్మాణానికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి ఉంది. ప్రకృతి సమతుల్యత కూడా దెబ్బతినే అవకాశం ఉంది. రెవెన్యూ నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రహదారిని నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణానికి పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేపడతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# 18న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయండి



(మొదటిపేజీ తరువాయి)

వస్తున్న సిపిఐ ప్రజా ప్రచార జాతయాత్రను మణుగూరు హనుమాన్ టెంపుల్ వద్ద మండల పట్టణ నాయకులు స్వాగతం పలుకుతూ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తామంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సెంటర్లో జరిగిన కార్నర్ మీటింగ్‌లో సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా హాజరై మాట్లాడుతూ 1925 ఉత్తర్ ప్రదేశ్ లో డిసెంబర్ 26న ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ ఈ దేశానికి స్వాతంత్రం కోసం బ్రిటిష్ పరిపాలన కోసం ఆనాడు కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి నాటి నుండి నేటి వరకు ఈ దేశంలో అంటరానితనం, కుల వివక్ష జరగాలని, దున్నేవానికే భూమి కావాలని,వ్యవసాయ కూలీలకు కూలీ రేట్లుపెంచాలని, సమానత్వం రావాలని పోరాటం కొనసాగించింది ఎర్రజెండా అన్నారు. పేదల కోసం రైతుల కోసం కార్మికుల కోసం కష్టజీవుల కోసం ఎర్రజెండా నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఈ దేశంలో 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగినదని నేడు అధికారం లేకుండానే అనేక పార్టీలు కనుమరుగైపోతున్నాయని పేద ప్రజల అండ ఉండటంవల్లనే ఇంకా ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీ ముందుకు సాగుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ పోరాటల వల్ల అనేక హక్కులు, కార్మిక చట్టాలను సాధించుకున్నామని వాటి స్ఫూర్తితో భవిష్యత్తులో ముందుకు సాగాలని వారు పిలుపునిచ్చారు. జనవరి 18వ తేదీన ఖమ్మం లో జరిగే కనీవినీ ఎరుగని బహిరంగ సభకు 40 దేశాల నుండి ప్రతినిధులు రాష్ట్ర దేశాల నుండి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారని కావున ఈ బహిరంగ సభకు మణుగూరు పట్టణం మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమితి సభ్యులు పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, జిల్లా సమితి సభ్యులు, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ లక్ష్మీ నారాయణ, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, పట్టణ కార్యదర్శి దుగ్గ్యాల సుధాకర్ , సింగరేణి కాలనీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, జిల్లా సమితి సభ్యులు ఏడారి రమేష్, వేరుపుల మల్లికార్జున్, సోందికుటుంబరావు, ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్తపల్లి సీతారాములు, రైతు సంఘం జిల్లా నాయకులు మంగి వీరయ్య ఎస్కే సర్వర్, మణుగూరు మండలం మహిళా సమైక్య అధ్యక్షురాలు సమ్మక్క, కార్యదర్శి సుజాత నిర్మల, సాంబాయిగూడెం సర్పంచ్ చీడ ఉషారాణి, రామంజివరం సర్పంచ్ బాడిషా కల్పన, ఉప సర్పంచ్ పులిగల రమేష్, వార్డ్ మెంబర్లు వజ్రా వెంకటేశ్వర్లు, వేర్పుల నరేష్ మండల, పట్టణ కార్యవర్గ సభ్యులు కన్నెబోయిన ప్రసాద్ ఆధర్ల రాములు, కోటేశ్వరరావు, రంజిత్, ప్రజాసంఘాల వాద్యులు నాయకత్వం వహించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఆడుతూ పాడుతూ పాల్గొన్నారు.

# ఖమ్మం నుంచే పెన్షనర్ల సమర శంఖం

**-పోరాటం లేకుండా సమస్యలు పరిష్కారం కావు**
**-పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి సుధాకర్**
**-పెన్షనర్ల డైరీ, క్యాలెండర్ విడుదల**












**ప్రజాపక్షం/ ఖమ్మం :** పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం నుంచే సమర శంఖం పూరించాలని ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి. సుధాకర్ పిలుపునిచ్చారు. పోరాటం లేకుండా ఎక్కడ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ప్రభుత్వాల వైఖరి మారాలంటే పోరాటమే శరణ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్ల సదస్సు ఆదివారం స్థానిక టిఎన్‌జీవో ఫంక్షన్ హాల్‌లో జరిగింది. జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సదస్సులో సుధాకర్ మాట్లాడుతూ పాలక వర్గాలు పెన్షనర్ల పై పెట్టే ఖర్చు ను వృధా ఖర్చుగా భావిస్తున్నాయని ఈ క్రమంలోనే ఓపిఎస్‌ను రద్దు చేశారని ఆయన తెలిపారు. 2014లో రాంలీలా మైదానంలో 10 లక్షల మందితో ర్యాలీ నిర్వహించడం జరిగిందని ఆ తర్వాత సుప్రీం కోర్టు కూడా పెన్షన్ భిక్ష కాదని ఉద్యోగుల హక్కు అని తీర్పునిచ్చిన సంగతి ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత పెన్షన్ విధానంలో అనేక లోపాలు ఉన్నాయని పెరుగుదల ఉండదని ఆఖరి 12 నెలల వేతనంలో సగం మాత్రమే ఇస్తారని ఆయన తెలిపారు. పెన్షన్ వ్యాలిడేషన్ చట్టం వచ్చిందని రూల్స్‌ను మార్చారని 2026 జనవరి ఒకటి నుంచి ఎనిమిదవ వేతన కమిటీ సిఫారసులను అమలు చేసే అధికారం కేంద్రం తన చేతుల్లోకి తీసుకుందని సుధాకర్ తెలిపారు. కంట్రోల్ పే కమిషన్‌ను అనుసరించి 15 రాష్ట్రాలు పే రీవిజన్‌ను అమలు చేస్తున్నాయని దక్షిణాది రాష్ట్రాలలో సొంత పిఆర్‌సి ఉన్నాయని అయినా కేంద్రం మనకు నష్టం చేసే విధంగా నియమాలను రూపొందిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ఎదుగుదల లేని పిఆర్‌సి, డిఏలు రాకుండా ఇలాగే కొనసాగిద్దామా అని ఆయన పెన్షనర్లను ప్రశ్నించారు. మార్చి 25ను విద్రోహ దినంగా పెన్షనర్లు పాటించాలని ఆయన పిలుపునిచ్చారు. మహారాష్ట్రలో హెల్త్‌స్కీమ్ రూ.35వేల వరకే పరిమితమైందని పశ్చిమబెంగాల్‌లో డిఏలు కోర్టు ద్వారా పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెన్షనర్లకు మద్దతు ఉందని చెప్పిన ప్రభుత్వాలు ఆ తర్వాత సమస్యలను పరిష్కరించ లేదని ఆయన అన్నారు. జేఏసి నాయకత్వంపై ఉద్యమ బాధ్యత ఉందని రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాలు పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాయని ఈ రాష్ట్రంలో కూడా ఓపిఎస్ అమలయ్యేవిధంగా పోరాటం కొనసాగించాలన్నారు. సభలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని తమిళ నాడులో పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నట్లే తెలంగాణలో కూడా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో అనేక ఉద్యమాలు పురుడుపోసుకున్నాయని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ఖమ్మం వేదికగా ఉద్యమం ఉధృతం చేయాలని రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. ఐక్య కార్యాచరణకు తమ సంఘం సంపూర్ణ మద్దతునిస్తుందని ఆయన తెలిపారు. ఈ సభలో మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి జయభారతి, తెలంగాణ మహిళా ఛైర్‌పర్సన్ వి. రమాదేవి, సంఘం నాయకులు నాగమణి, శంకర్ లింగం, రాంమనోహర్, పురుషోత్తం, టిజివో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, వేలాద్రి, జిల్లా నాయకులు రాయల రవికుమార్, ఐవి భాస్కరాచారి, కనపర్తి వెంకటేశ్వర్లు, గుర్రాల శ్రీనివాసరావు, మేరీ ఏసుపాదం, పెదమళ్ల సత్యనారాయణ, శరత్‌బాబు, ఊడుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### డైరీ ఆవిష్కరణ, సన్మానం..

సదస్సు అనంతరం పెన్షనర్ల సంఘం డైరీని, క్యాలెండర్‌ను అసోసియేషన్ నాయకులు ఆవిష్కరించారు. సదస్సు సందర్భంగా వివిధ శాఖలకు చెందిన పలువురిని సీనియర్ పెన్షనర్లను ఘనంగా సన్మానించారు.

# సిపిఐది వందేళ్ల పోరాట చరిత్ర

**-18న ఖమ్మంలో భారీ బహిరంగ సభ**
**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల**






**ప్రజాపక్షం/ ముదిగొండ :** వందేళ్ల సుదీర్ఘ పోరాట చరిత్ర సిపిఐ సొంతమని సుదీర్ఘ పయనంలో అనేక పోరాట విజయాలను సాధించిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. తెలిపారు. పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు యువతను కార్యోన్ముఖులను చేసేందుకు జనవరి 18న శతాబ్ది ఉత్సవ ముగింపు సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ముదిగొండ మండలంలో సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభ జయప్రదం కోరుతూ జాతా ద్వారా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ముదిగొండ సెంటర్‌లో జరిగిన సభలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్యం అనంతరం ప్రజల పక్షాన నికరంగా నిలబడి పోరాడింది కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే భూ పంపిణీ జరిగిందని నిజాం రాజ్యం భారతదేశంలో విలీనమైందని బ్యాంకుల జాతీయకరణ జరిగిందన్నారు. భారతదేశంలో పేదలకు అందుతున్న సంక్షేమ పథకాల వెనక కమ్యూనిస్టుల త్యాగాలు ఉన్నాయన్నారు. ఒక పక్క సంక్షేమం, హక్కుల కోసం పోరాడుతూ మరో పక్క మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లా అనేక ఉద్యమాలకు వేదికగా నిలిచిందని ఇప్పుడు కూడా ఒక చారిత్రిక సభకు వేదిక కానుందని జితేందర్‌రెడ్డి తెలిపారు. లక్షలాది మంది శత వసంతాల ముగింపు సభకు తరలి రానున్నారన్నారు. ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనున్న సభకు అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని ఆయన పిలుపు నిచ్చారు. సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహలక్ష్మి, ఆరెంపుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### తిరుపతమ్మకు నివాళి..

సిపిఐ సీనియర్ సభ్యురాలు గంగాధరి తిరుపతమ్మకు సిపిఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల మరణించిన తిరుపతమ్మ ఇంటికి వెళ్లి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తిరుపతమ్మ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు.

## మున్సిపాలిటీ సమరంలో 'మహిళే' కీలకం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మున్సిపాలిటీ ఎన్నికలు త్వరలో జరగబోతున్న నేపథ్యంలో ప్రతి వార్డులోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో మహిళా ఓటర్లు కీలకం కానున్నారు. మొదటిసారి చైర్మన్ పదవి ఎవరిని వరించేనో మున్సిపాలిటీలో చర్చలు కొనసాగుతున్నవి. మొత్తం వార్డులు 20 కాగా, పురుషులు ఓటర్లు 9081, మహిళా ఓటర్లు 9785, అధికంగా ఉన్నారు. మొత్తం ఓటర్లు 18,866 ఉన్నారు. దీనివలన మున్సిపాలిటీలో మహిళా ఓటర్లే కీలకం కానుంది. గెలుపులో మహిళా పాత్ర ఎంతో ముఖ్యమైంది కానుంది. ఇప్పటికే ఓటర్ల జాబితాను పట్టుకొని నేతలు జల్లెడ పడుతున్నారు. రాజకీయ పార్టీలు వారు ఇప్పటికే వార్డులలో గెలుపు గుర్రాల కోసం కసరత్తులు ప్రారంభించారు. మున్సిపాలిటీలో ఏడు గ్రామపంచాయతీలు నూతనంగా విలీనం కాగా అవి వార్డులుగా విభజించారు. తూర్పు లోకవరం, పడమర లోకవరం, పుల్లయ్య బంజర ,కిష్టయ్య బంజర, హనుమ తండా, వాచ్యనాయక్ తండ, కప్పల బంధం, ఆయా గ్రామ పంచాయతీలను కల్లూరు నూతన మున్సిపాలిటీలో విలీనం చేశారు. వీటి పరిధిలోని అధికంగా మహిళలు అధికంగా ఉన్నారు. దీని వలన మహిళదే గెలుపుకి కీలకం కానుంది. మున్సిపాలిటీ పోరులో మహిళదే పెత్తనం కానుంది. మరో వారంలో రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి, ఓటరు జాబితా ముసాయిదా బయటకు రానున్నడంతో ఉత్కంఠ భరితంగా రిజర్వేషన్ కోసం ప్రధాన పార్టీలు ఎదురుచూపులతో చూస్తున్నారు.

## అబాకస్ పోటీల్లో చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థుల ప్రతిభ





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఖమ్మం పట్టణంలోని నిర్మల్ హై స్కూల్ లో ఆదివారం జిల్లా స్థాయిలో జరిగిన అబాకస్ పరీక్షలో సత్తుపల్లి చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. సీనియర్ విభాగం లో టి. వంశీ ద్వితీయ బహుమతి, జూనియర్ విభాగం లో ఎం.డి అస్మత్ ద్వితీయ బహుమతి సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, గణిత ఉపాధ్యాయులు బి. శ్రీనివాస్, భువనేశ్వరి లను పాఠశాల ప్రిన్సిపాల్ వై. మురళీకృష్ణ, డైరక్టర్లు ఆర్. సుజాత, ఆర్. రాకేష్, ఎం. రవికుమార్ అధ్యాపక బృందం అభినందించారు.

## కార్మికులకు అల్పాహారం వితరణ




**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎపి సింగ్ జన్మదినోత్సవం సందర్భంగా దాల్ మిల్లు కార్మికులకు మధ్యాహ్న అన్న ప్రసాద వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షులు, జిల్లా జాయింట్ సెక్రటరీ దారా శ్రీనివాసరావు, బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎపి సింగ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రిలీఫ్ వీక్‌గా ప్రకటించి వారంరోజులు అన్న ప్రసాద వితరణ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కో ఆర్డినేటర్ కర్నాటి లక్ష్మారెడ్డి, సెక్రటరీ నంబూరు కనకదుర్గ ప్రసాద్, మాజీ సెక్రటరీ కటికి వెంకటేశ్వర్లు, జి.బాలకృష్ణ, దాల్ మిల్లు కార్మికులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వెనిజులాపై అమెరికా దాడి దురాహంకార చర్య



**ప్రజాపక్షం/ తల్లాడ :** వెనింజులాపై అమెరికా దాడి దురాహంకార చర్య అని, ఇది అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని వెనింజులా దేశ అధ్యక్షుడు నికోలస్ మధురో అతని భార్యను అమెరికా బంధించడాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) కల్లూరు డివిజన్ కార్యవర్గ సభ్యులు డి.శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నచ్చని దేశాలను నయానో, భయానో లొంగ దీసుకోవడం, మాట వినకపోతే ఆయా దేశాల అధినేతలను శిక్షించడం అమెరికాకు పరిపాటిగా మారిందన్నారు. ఒక దేశం మరో సార్వభౌమ దేశంపై దాడి చేసి ఆ దేశాధినేతను భార్య సమేతంగా ఎతుకెళ్లడం అంతర్జాతీయ చట్టాలను, సంప్రదాయాలను, పద్ధతులను తుంగలో తొక్కడమే అన్నారు. ఇలాంటి దాడులను ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయునిగా హసీనాబేగం



**ప్రజాపక్షం/ మధిర:** మధిర హరిజనవాడ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న షేక్.హసీనాబేగం ఉత్తమ ఉపాధ్యాయినిగా జిల్లా కలెక్టర్ అనుదీప్ చేతుల మీదుగా సన్మానం చేశారు. ప్రథమ మహిళా ఉపాధ్యాయుని, సంఘ సంస్కర్త, త్యాగశీలి సావిత్రిబాయిపూలే 195వ జయంతి సందర్భంగా ఖమ్మం కలెక్టరేట్‌లో షేక్.హసీనా బేగంను జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్యజైని ఆధ్వర్యంలో శాలవాలతో, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా టిఎస్‌యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ ఎ.వినోద్‌రావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, ఇ.వీరయ్య మాట్లాడుతూ గతంలో మర్లపాడు, దెందుకూరు, కుంచపర్తిలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేసి ప్రస్తుతం మధిర హరిజన వాడ ఎంపిపిఎస్ నందు పనిచేస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికై విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉత్తమ ఉపాధ్యాయునిగా విలువైన సేవలు అందిస్తున్నారన్నారు. ఆమె చేసిన సేవలను గుర్తించి ఉత్తమ మహిళా ఉపాధ్యాయునిగా సత్కరించటం జరిగిందని అభినందించారు. అభినందనలు తెలిపిన వారిలో కోశాధికారి మహమ్మద్ రఫీ, ఉపాధ్యక్షులు షేక్.ఇబ్రహీం, కాజా సునీత, బి.చెన్నయ్య, డి.కవిత, జి.విజయలక్ష్మి, వూట్ల కొండలరావు, కె.ఆదాం, భీమశంకరరావు, లంక నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

## నేటి ప్రచార జాతాను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/చింతకాని :** సిపిఐ శతవసంతాల సభ జనవరి 18న ఖమ్మం లో జరగనున్న నేపథ్యంలో సభ విజయవంతం కోసం సోమవారం చింతకాని మండలంలోకి సిపిఐ ప్రచార జాత రానుందని సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు పేర్కొన్నారు. సోమవారం మధ్నాహ్యం 2.30గంటలకు నాగులవంచలో మండలంలోకి ప్రచార జాత ప్రవేశిస్తుందని ,3.30గంటలకు పాతర్లపాడు, 4.30గంటలకు పొద్దుటూరు, 5.10గంటలకు నాగిలి గొంద, 5.45 నుంచి 6.15 వరకు కోమట్లగూడెం , నేరడ , 6.30 గంటలకు కొదుమూరు, రాత్రి 7.15 కు బస్వాపురంలో ప్రచార జాత వస్తుందన్నారు. ఈ ప్రచార జాతలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, మండల నాయకులు పాల్గొంటారని. గ్రామ శాఖలు మండల కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రచార జాతను విజయవంతం చేయాలన్నారు.

## వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/జూలూరుపాడుః** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వసతి గురాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోతు వంశీ డిమాండ్ చేశారు. ఆదివారం పలు వసతి గృహాలను ఏఐఎస్ఎఫ్ జూలూరుపాడు మండల సమితి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులతో మాట్లాడి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వసీదుకురాల విద్యార్థుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరితో వసతి గృహాల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేసిందని వారు ఆరోపించారు. నరసాపురం లో ఉన్న వసతి గృహం పహరీ గోడ నిర్మించాలని అనేకసార్లు అధికార దృష్టికి తీసుకెళ్లిన అధికారులు పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వసతి గృహాలు గుట్ట పక్కన ఉండడం వల్ల ఎప్పుడు ఏమవుతుంది అని తెలియక విద్యార్థులు విద్యా తల్లిదండ్రులు భయాందోళన గురవుతున్న అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వివరించడం సరికాదని వారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి వారి కూడా నిర్మించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు అనిల్ కుమార్, సాయి తేజ మండల నాయకులు హేమంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన హమాలీ సంఘం (ఎఐటియుసి) ఎన్నిక




**ప్రజాపక్షం/ఇల్లందు:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె సారయ్య అన్నారు. ఆదివారం ఇల్లందు పట్టణంలోని విట్టల్‌రావు భవన్ నందు ఏఐటియూసి హమాలి మహాసభలో నూతన హమాలి సంఘంను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్లుగా విభజించి కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాలను తీసుకువచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో పని చేస్తున్న భవన నిర్మాణ, హమాలీ, ట్రాన్స్‌ఫోర్ట్, ఆటో రంగాల కార్మికులకు ఉపాధి కల్పించి పిఎఫ్, ఈఎస్ఐ, ప్రభుత్వ భీమా, ఉద్యోగ భద్రత తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం హమాలి కార్మికుడు వీరయ్య అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన ఏఐటియూసి హమాలి సంఘం గౌరవ అధ్యక్షులుగా బైరబోయిన సదానందం, అధ్యక్షులుగా గోనెల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి రాయి గాంధీ, ముఠామేస్త్రీగా యాటకారి బాలు, కోశాధికారిగా బిల్లకంటి సుధాకర్, దాడవాయిగా బిక్షపతి ఎన్నికయ్యారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, పట్టణ మండల కార్యదర్శులు బాస శ్రీనివాసరావు, బొప్పిశెట్టి సత్యనారాయణ, షేక్ వలి, రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటిద్దాం.. రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం



**ప్రజాపక్షం/ తల్లాడ :** సమాజంలో ప్రతిఒక్కరూ రోడ్డు నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ సూచించారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆదివారం తల్లాడ పట్టణంలో వాహన దారులకు హెల్మెట్ ధరించటంపై బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్క వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుండి తల్లాడ పట్టణంలోని ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించి అవగాహన కల్పనలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. ప్రతిఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా వాడాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు తమ సంపూర్ణ మద్ధతు ప్రకటించారు. వాహనదారులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సై 2 వెంకటేష్, కానిసేబుల్స్, రాజకీయ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# అభివృద్ధే శ్వాసగా పనిచేయండి

**సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ కె నారాయణ**





**ప్రజాపక్షం/చింతకాని :** అభివృద్ధే శ్వాసగా పనిచేస్తే ..ప్రజలే తరతరాలు ఆదరిస్తారని సిపిఐ జాతీయ కంట్రోల్ కమీషన్ చైర్మన్ కె నారాయణ పేర్కొన్నారు. ఆదివారం చింతకాని మండలం నేరడ గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ అభినందన సభ కు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో నారాయణ మాట్లాడుతూ నేతాజీ చిన్నతనం నుంచి సామాజిక అంశాలపై అవగాహన కలిగిన వ్యక్తి అని జర్నలిస్టుగా ఈ గ్రామ సమస్యలు తనకు తెలుసునని ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎంతో కృషి చేస్తాడని అన్నారు. అభివృద్ధి చేస్తే ప్రజలు ఎప్పటికీ మర్చిపోరని రాజకీయలకతీతంగా అభివృద్ధి చేసి ప్రజలతో మమేకం అవ్వాలని నూతన పాలకమండలికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నేతాజీ నేరడ అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతాడని పేర్కొన్నారు.అంతకు ముందు నేతాజీయువజన సంఘం ఆధ్వర్యంలో 50కేజీల కేక్ కట్ చేసి నేతాజీకి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామస్థులు , వివిధ పార్టీల నాయకులు, నూతన సర్పంచ్‌లు, సన్నిహితులు నేతాజీని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు, తాటి వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, పావులూరి మల్లిఖార్జునరావు, కూచిపుడి రవి, జిల్లా కౌన్సిల్ సభ్యులు దూసరి శ్రీరాములు, రాసాల మోహన్‌రావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, టీడీపీ మండలాధ్యక్షుడు తేలుకుంట్ల శ్రీనివాసరావు, నూతన సర్పంచ్‌లు కాంపల్లి కోటమ్మ, ఆవుల నర్సింహారావు, కిలారి మనోహర్ బాబు, మడిపల్లి అంబిక, సిపిఐ , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాడేది సిపిఐ

**-సిపిఐ శత వసంతాల ముగింపు సభను జయప్రదం చేయండి**
**-సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజల కోసం, ప్రజా సమస్యలపై పోరాడిది భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి అన్నారు. సిపిఐ శతవసంతాల ముగింపు భారీ బహిరంగ సభ జనవరి 18న ఖమ్మం లో జరుగు సభను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జాతా ఆదివారం నేలకొండపల్లి మండ దానికిచేరుకుంది. మండల కేంద్రం లో అనంతరం ముఠాపురం గ్రామంలో సిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్రం ఉద్యమం నుండి ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. భారతదేశంలో భారత కమ్యూనిస్ట్ పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని శత వసంతాల ముగింపు సభ ఖమ్మం లో నిర్వహించుకోవడం మనకు గర్వకారణం అని తెలిపారు. ఈ భారీ బహిరంగ సభకు వేలాదిగా తరలి వచ్చి ఫాసిస్టు బిజేపి పాలనకు వ్యతిరేకంగా పోరాటాం చేయాలన్నారు. 40 దేశాల నుంచి ప్రజాప్రతినిధులు మన దేశంలో అని రాష్ట్రల నుంచి సిపిఐ ప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరవుతారు అని తెలిపారు. ఈ భారీ బహిరంగసభ కు మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, కర్నాటి భాను ప్రసాద్, సీతామహాలక్ష్మి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కనకబండి సీతారాములు, మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండలం కార్యవర్గ సభ్యులు బాగం నరసింహ రావు, కౌన్సిల్ సభ్యులు తాళ్లూరి శ్రీమతి, గుగులోతు కాంతమ్మ, బానోతు బాలాజీ, మూడు శ్రీను, గుగులోతు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కూసుమంచి:** భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)పుట్టి భారత గడ్డపై నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏఐటియూసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి నేతృత్వంలో సత్తుపల్లిలో ప్రారంభమైన సిపిఐ జిల్లా ప్రచార జాత ఆదివారం కూసుమంచి మండలానికి చేరింది. ఈసందర్భంగా కూసుమంచి మండల కార్యదర్శి భూక్య నరసింహ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. అనంతరం సెంటర్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల చరిత్రలో అలుపెరగని పోరాటాలు చేసి అను నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అనేక రాష్ట్రాల్లో సాయుధ పోరాటాలు, దేశ వ్యాప్తంగా సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. అనంతరం ప్రచార జాత మండలంలోని గైగోళ్లపల్లి, లాల్‌సింగ్ తండా, సంధ్యతాండ మీదుగా తిరుమలయపాలెం మండలానికి చేరుకుంది. గైగోళ్ళపల్లిలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాకు ఒక సుదీర్ఘమైన చరిత్ర ఉందని, గైగోళ్ళపల్లి గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ సంగబత్తుల వెంకటరెడ్డి పేద ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేసి భూమి లేని నిరుపేదలకు వందల ఎకరాల భూమిని పంచి ఇచ్చిన ఘనత ఉందన్నారు. పోరాటాల ఖిల్లాగా పేరు పొందిన ఖమ్మం గడ్డపై దేశ వ్యాప్త భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ద కాలపు పోరాటాల జ్ఞాపకాలతో శత జయంతి ఉత్సవాల ముగింపు సభ జరుగుతుందని, ఈ సభకు వేలాదిగా గ్రామ, గ్రామాన సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కత్రోజు పాండు రంగాచారి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుండె పొంగు మల్లేష్, మండల కార్యదర్శి భూక్యా నరసింహ, సహాయ కార్యదర్శి జిల్లా లింగయ్య, లాల్‌సింగ్ తండా శాఖ కార్యదర్శి భూక్యా శ్రీకాంత్, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షులు వీరన్న నాయక్, నాయకులు జిల్లా నాగరాజు, చెరుకుపల్లి మల్సూరు, గుండెపంగు మధు, జిల్లా రంగమ్మ, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజూ కొనసాగిన సిపిఐ ప్రచార జాతా

**-శత వసంత ఉత్సవ ముగింపు మురిసేలా ఉండాలి**
**-ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/మణుగూరుః** సిపిఐ శతవసంతాల ఉత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ప్రారంభమైన ప్రచార జాత రెండో రోజూ కొనసాగింది. పినపాక నియోజకవర్గం పరిధిలోని అశ్వాపురం మండలం నుండి ఆదివారం ప్రారంభమైన ఈ జాత మణుగూరు పినపాక కరకగూడెం గుండాల వరకు చేరింది. ఆయా మండల కేంద్రాల్లో ప్రచార జాతకు కమ్యూనిస్టు నాయకులు బ్రహ్మరథం పట్టారు. ఈ జాతను ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాష మాట్లాడారు. 1925వ సంలో కాన్పురులో ఆవిర్భవించిన సిపిఐ అంచలంచెలుగా దేశవ్యాప్తంగా వ్యాపించి నూరేళ్ళను పూర్తి చేస్తుందని చెప్పారు. ఈ శతవసంతాన్ని పురస్కరించుకొని ఖమ్మం కేంద్రంగా ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు దేశ నలుమూలల నుండి కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధులు తరలి వస్తున్నారని, రెడ్ షర్ట్ వాలంటీర్ల ఎర్ర కవాతుతో ఖమ్మం నగరం ఎరుపెక్కనుందని చెప్పారు. దేశమే అబ్బురపడేలా ఈ ముగింపు ఉత్సవ సభ జరగనుందని. కమ్యూనిస్టులు ఎక్కడున్నారు వారి పని అయిపోయిందంటూ విర్రవీగిన వారి నోళ్లు మూతపడేలా నూరేళ్ల ఉత్సవ ముగింపు కార్యక్రమం అట్టహాసంగా జరగనుందని చెప్పారు. నియోజకవర్గ వ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి ఉత్సవానికి తరలిరావాలని. నూతన ఉత్తేజంతో పదునెక్కిన ఉద్యమాలతో ప్రజాక్షేత్రంలో సమస్యల పరిష్కారం కోసం నవవసంతాన్ని ప్రారంభిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ ప్రచార జాతాకు ఘన స్వాగతం

**- ఎర్రజెండాల రెపరెపలు, ద్విచక్రవాహనాలతో కొనసాగిన ర్యాలీ**







**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** సిపిఐ వందేళ్ల వేడుక విజయవంతంలో భాగంగా చేపట్టిన ప్రచార జాతాకు ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెకోడులో ఆదివారం ఘన స్వాగతం లభించింది. ఈ జాత రాష్ట్ర రైతు సంఘం నాయకుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎర్రజెండాల రెపరెపలు, ద్విచక్ర వాహన ర్యాలీగా కొనసాగింది. ఇక్కడి నుంచి ఎం,వెంకటాయపాలెం, పల్లెగూడెం, ముత్తగూడెం, ఏదులాపురం మీదుగా వరంగల్‌క్రాస్‌రోడ్‌లో ముగిసింది. ఈ సందర్భంగా ఆరెకోడులో సిపిఎం సర్పంచ్ ఆరెంపుల రమాదేవి జాతాకు సంఘీభావం తెలిపారు. అలాగే ఎం,వెంకటాయపాలెంలో అమరవీరులు గంగవరపు విజయ్‌కుమార్ విగ్రహాలకు జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ముత్తగూడెంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, వరంగల్‌క్రాస్‌రోడ్‌లో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, పల్లెగూడెంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్ జాతాకు స్వాగతం పలికి కార్నర్‌మీటింగ్‌లో వందేండ్ల వేడుక విజయవంతంపై ప్రసగించారు. ఈ సందర్భంగా కళాకురుల పాటలు, కామ్రేడ్స్ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమాలలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, అజ్మీరా రామ్మూర్తి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు పగీళ్ల వీరభద్రం, లింగా వెంకటనారాయణ, బూర నాగేశ్వరరావు, పాసంగుల చంద్రావు, వెంపటి సురేందర్, మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు, గిరిజన సంఘం నాయకులు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంఘం సభ్యులు, పల్లెగూడెం సర్పంచ్ చుండూరి సృజన, ఆరెకోడు ఉప సర్పంచ్ కొరివి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 18వ తేదీ ఆదివారం ఖమ్మం పట్టణంలో జరుగుతున్న భారీ బహిరంగ సభలో లక్షలాదిగా ప్రజలందరూ పాల్గొని జయపద్రం చేయాలని కోరుతూ ఈనెల మూడవ తేదీ నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని మండలాల నుండి ప్రచారంలో భాగంగా జరుగుతున్న జీబ్ జాత ఈనెల ఆరవ తేదీన మంగళవారం ములకలపల్లి మండల కేంద్రానికి రానున్నదని ఈ సందర్భంగా జరుగు బహిరంగ సభను జయపద్రం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్ సిపిఐ శ్రేణులను కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో మొట్ట మొదటి రాజకీయ పార్టీ సిపిఐ కమ్యూనిస్టు పార్టీ అని వందేళ్ళ నుండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమ సమాజం స్థాపన కోసం కార్మిక ఉద్యోగ రైతు కూలీ మహిళల హక్కుల పరిరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీ ఎంతో దేశానికి సేవ చేసిందని అన్నారు. దున్నేవాడికి భూమి కావాలని తెలంగాణ రైతాంగ సాయుధ పోరు నిర్వహించి 4500 మంది అమరత్వంతో పది లక్షల ఎకరాల భూమిని పేదలందరికీ పంచి పెట్టిన ఘనమైన చరిత్ర సిపిఐకి దక్కిందని, ఏజెన్సీ ప్రాంతంలో పోడు భూముల పోరాటం పేరుతో లక్షల ఎకరాల పోడు భూములు నరికించి పేదలందరికీ పట్టాలిప్పించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని అన్నారు. ఈసందర్భంగా ఖమ్మంలో జరుగు భారీ బహిరంగ సభ బ్రోచర్లను రిలీజ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరాటి రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి అనుముల సాయి, సిపిఐ నాయకులు మిరియాల వెంకన్న, పసుపులేటి వెంకటేష్, నల్లి రామారావు, నకరికంటి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశాలకు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి

**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలలో 2026, 2027 సంవత్సరానికి గాను 5వ తరగతి మరియు 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఉమ్మడి ప్రవేశ పరీక్షకు ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల సింగరేణి ప్రిన్సిపాల్ జి హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన గురుకుల పాఠశాల సింగరేణిలో 5వ తరగతి మరియు 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు ప్రవేశం పొందుటకు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు ఆన్లైన్‌లో 11డిసెంబర్ 2025 నుండి 21జనవరి2026 వరకు ఆన్లైన్‌లో 100 రూపాయలు రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేయడానికి అభ్యర్థి రెండు పాస్ ఫోటోలు, అభ్యర్థి సంతకం, ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వికలాంగులైతే సంబంధిత సర్టిఫికెట్, మొబైల్ నెంబర్‌ను తప్పని సరిగా పొందుపరచాలని తెలిపారు. పాఠశాలలో ప్రవేశం పొందుటకు కావలసిన పూర్తి సమాచారం కొరకు సమీపంలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయం సింగరేణి సంప్రదించాలని దీనికి సంబంధించి గురుకులాల యొక్క ప్రత్యేకత, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, కార్పొరేట్ స్థాయిలో విద్యను అందిస్తున్నందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## లాలు కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కారేపల్లి:** పాత కమలాపురం గ్రామ పంచాయితీలోని చీమ్నతండా గ్రామంలో 28 డిసెంబర్ 2025న గుగులోత్ లాలు (63)మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పాత కమలాపురం సర్పంచ్ తేజావత్ బాబురావు, మాజీ రైతుబంధు మండల కన్వీనర్ గుగులోత్ శ్రీను ఆ కుటుంబానికి 100 కేజీల బియ్యం ఇవ్వడం జరిగింది. అదే విధంగా భూక్య రవి రూ 1000, పికెపి యూత్ ఫోర్స్ సైన్యం రూ 3000లను ఆర్థిక సాయాన్ని సర్పంచ్ తేజావత్ బాబురావు చేతుల మీదుగా అందించారు. ఈకార్యక్రమంలో పికెపి యూత్ ఫోర్స్ సైన్యం బానోత్ శ్రావణ్, పొదిల నరేష్, భూక్య నందు, బాదావత్ లక్ష్మణ్, తేజావత్ శ్రీను, వాస్, చీమ్నతండా గ్రామ పెద్దలు గుగులోతు రాజేష్, గుగులోతు కోటేష్, గుగులోతు బాలు, గుగులోతు మంగ్య, గుగులోతు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల వలలో రైతులు పడొద్దు


**ప్రజాపక్షం/కూసుమంచి:**మండలంలోని ఏ ఒక్క రైతు కూడా సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కూసుమంచి మండల ఏవో రామడుగు వాణి అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తాజాగా సైబర నేరగాళ్ల వలలో పడి మన మండలంలోని ఓ రైతు మోసపోయిన విషయం అందరికీ విధితమేనని, రైతులందరూ గమనించవలసిన విషయం ఏమిటి అంటే రుణమాఫీకి సంబంధించి ఎవరూ ఎటువంటి ఫోన్ చేయరని, ఏమైనా సందేహాలు ఉంటే వ్యవసాయ శాఖని కానీ, బ్యాంకు అధికారులను కానీ సంప్రదించి మాత్రమే చెల్లింపులు చేయాలని తెలిపారు. వాట్సాప్‌లో వచ్చే పీఎం కిసాన్ వంటి ఏపికె ఫైల్స్‌ని కూడా డౌన్‌లోడ్ చేయవద్దని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలయ్యే పథకాలకు సంబంధించిన వివరాలకైన సంబంధిత ఏఈవోని గానీ, ఏవోని గానీ సంప్రదించాలని సూచించారు.

## నిత్యావసర సరుకుల పంపిణీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని మూకమామిడి గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో గల వలస ఆదివాసి గ్రామం అయిన ఏనుగప్పనగర్ గ్రామంలో రహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి చేతుల మీదుగా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రహ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు బచ్చు హరీష మాట్లాడుతూ మారుమూల వలస ఆదివాసీ గ్రామాలలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు కనీసం నిత్యవసర సదుపాయాలు కూడా లేని పరిస్థితిలో జీవిస్తు ప్రభుత్వం పథకాలకు నోచుకోని స్థితిలో జీవనం సాగిస్తున్నారని, మా రహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్న సహాయముగా ఒక్కొక్క ఇంటికి ఒక నెలకు సరిపడ బియ్యం నిత్యవసర సరుకులు అందజేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ సంయుక్త మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, మండల నాయకులు ఎర్రగొర్ల రామారావు, నకిరేకంటి నాగేశ్వరరావు, ప్రజా గొంతుక రిపోర్టర్ గడ్డం వెంకటేష్, రహ ఫౌండేషన్ కో ఫౌండర్ కొప్పరపు నాగేశ్వరి, సభ్యులు కందుకూరి రజిత, కొత్తగుండ్ల రవిచంద్ర, బచ్చు శ్రీకర్, గొర్లి తరుణ్, గ్రామ కమిటీ సభ్యులు బాబురావు, ఊకే అజయ్, మాడివి గంగయ్య, ఊకే నారాయణ, మడివి విజయ్, అయితు, దేవా పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామానికి చెందిన ఓలేటి వెంకటరమణ నీటి సంపులో పడి ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటిలో నీటి సంపుపై మూత తొలగించి ఉండగా సరిచేసి క్రమంలో ఫిట్స్ రావటంతో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయాడని , తక్షణమే 108కి సమాచారం అందించగా హుటా హుటిన సంఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది సిపిఆర్ ( కార్డియో పల్మనరీ రిసస్యూటేషన్) చేస్తూ ఆక్సిజన్ అందిస్తూ మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

**-అభివృద్ధికి కేరాఫ్ వైరాను చేయడమే నా లక్ష్యం**
**-మున్సిపాలిటీ అభివృద్ధికి**
**మరో రూ.100కోట్ల నిధులు తీసుకొస్తా**
**-ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చి దిద్దుతానని, మరో రూ.100కోట్ల నిధులు తీసుకొస్తానని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. ఆదివారం వైరా మున్సిపాలిటీని 20 వార్డుల్లో సుమారు రూ.17కోట్లు నిధులు మంజూరుతో మున్సిపాలిటీని 20 వార్డుల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమాలు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ నిర్వహించారు. శంకుస్థాపన భూమి పూజ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముందు వైరా రింగు రోడ్డు సెంటర్ నందు స్వర్గీయ రాజీవ్‌గాంధి విగ్రహానికి జిల్లా పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పూలమాల వేశారు. అనంతరం వైరా రిజర్వాయర్ అలుగుల వద్ద దాసాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రిజర్వాయర్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుండి దాసాంజనేయ స్వామి దేవాలయం వరకు సుమారు కోటి రూపాయల నిధులు మంజూరుతో సిసి రోడ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ అభివృద్ధి తన లక్ష్యమని మున్సిపాలిటీ అభివృద్ధికి మరో రూ.100కోట్లు నిధులైనా తీసుకొస్తానని అన్నారు. వైరా పట్టణాన్ని అద్భుతంగా తీర్చిదిద్ది మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలనేదే తన లక్ష్యమని ఆయన అన్నారు. వైరా మున్సిపాలిటీలో మండల కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి పనులు వేగంగా జరుగుతున్నాయని, అలాగే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశామని యూనివర్శిటీ కంటే గొప్పలగా పాఠశాల నిర్మాణం త్వరలో ప్రారంభం కాబోతుందని ఆయన అన్నారు. అలాగే వైరా రిజర్వాయర్‌కు గతంలో నాగార్జునసాగర్ నుండి నీరు వచ్చిన ఎండాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఉండేవని, త్రాగునీటికే అనేక ఇబ్బందులు పడ్డారని అటువంటి సమస్యలు ఉండకుండా ఉండేందుకే ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా పాలనలో రూ.100కోట్లు ఖర్చు చేసి గోదావరి నుండి గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తీసుకొచ్చామని ఆయన అన్నారు. దీనివలన నియోజకవర్గంలోని 4 మండలాలకు త్రాగునీటి సమస్య సాగునీటి సమస్య ఉండదని, ఎండాకాలంలో కూడా 16,17 అడుగుల నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన అన్నారు. వైరా పట్టణంలోని రెండో పెద్ద రోడ్డుగా వాసవి కళ్యాణ మండపం నుండి కమ్మవారి కళ్యాణ మండపం వరకు నిర్మాణం చేపడుతున్న ఈ రోడ్డును ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. నాణ్యతలో ఎక్కడ రాజీ పడకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారం పది రోజుల్లో పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆదేశించారు. వైరా టౌన్‌లో నిరుపేదలైన లబ్దిదారులకు 500 మందికి ఇందిరమ్మ ఇళ్లు మజంఊరు చేశామని అలాగే అర్హత ఉన్న ప్రతి నిరుపేద లబ్దిదారుడికి ఇళ్లు ఇప్పించే బాధ్యత నాది అని ఆయన అన్నారు. త్వరలో రానున్న మున్సిపాల్ ఎన్నికల్లో కాంగ్రేస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని మెమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రజలను విజ్ఞప్తి చేశారు. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పాటుపడే కాంగ్రేస్ పార్టీ పక్షాన ప్రజలు నిలబడాలని ప్రజలకు మేలు చేసే ప్రజా ప్రభుత్వాన్ని దీవించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు , మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, మాజీ మున్సిపాల్‌వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, కాంగ్రేస్ మండల, పట్టణ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, పొదిల హరినాధ్ , ఫణితి సైదులు, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, రాంపూడి పాలేటి నర్సింహారావు, కొప్పురావూరి శబరి, ఫణితి శ్రీను, కట్ల సంతోష్, దార్న రాజశేఖర్, మిట్టపల్లి నాగి, కొల్లి రమేష్, సయ్యద్ అన్వర్, మాజీ మార్కెట్ చైర్మన్ బిడికె. రత్నం, నంబూరి కనకదుర్గ, మాజీ కౌన్సిలర్ బత్తుల గీత, ఆత్మ డైరెక్టర్ జాలాది రామకృష్ణ, పల్లపు కొండలు, చెరుకూరి కిరణ్, మాజీ కౌన్సిలర్ సూర్యదేవర శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐవి.నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేచర్ల మల్లేవ్వరి, మార్కెట్ డైరెక్టర్ రేచర్ల సత్యం, ఆది ఆనందరావు , కంభంపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

# బహుళార్ధ సేవకుడు లంకా కొండయ్య

**ప్రజాపక్షం/ మధిర :** ఎవరికైనా సేవ చేయాలనే తపన ఉన్నప్పుడు ఆ మనిషి ఎన్ని ఆటంకాలు వచ్చినా ఆగడు.. కారణం కొంతమంది మనుషుల్లో ఒక రకమైన స్ఫూర్తి ప్రేరణ కలిగిస్తుంది. ఇలాంటి వారికి ఇలాంటి సమాజ హిత కార్యక్రమాలు చేసినప్పుడు ఆ మనుషుల్లో గుడ్ హార్మోన్ రిలీజ్ కావడం ద్వారా వారు హ్యాపిగా ఉంటారని అని కొంతమంది శాస్త్రవేత్తలు, సైకాలజిస్ట్‌లు చెప్పుతుంటారు. సరిగ్గా ఎంతో మంది సేవకుల్లో మన మధిర సామాజిక సేవకుడు లంకా కొండయ్య ఒకరు.. ఇతను నిజంగా మన్ మ్యాన్ ఆర్మీ అనవచ్చు. ప్రముఖ సమాజ సేవకుడు కొండయ్య తన జీవింతంలోకి తొంగి చూస్తే మనసు చెలించిపోయే ఎన్నో విషయాలు మనకు బాధ అనిపిస్తుంది. 2015 సంవత్సరంలో కొండయ్య హార్ట్ స్ట్రోక్ వచ్చి హృదయానికి మూడు స్టంట్లు అమర్చిన విషయం తెలిసిందే. దీనికి తోడు కొండయ్య కుమార్తె లంకా శ్రీజ గత 28 సంవత్సారాలుగా నాలుగు గోడల మధ్య మంచానికే పరిమితం( కూర్చోదు, నిలబడదు, మాట్లాడదు, నడువ లేదు అన్ని మంచంలోనే దీనినే సిరిబ్రాల్ పాల్సీ సిపిఎంఆర్ అంటారు. ఇన్ని సమస్యలు ఉన్నా అన్ని మనస్సులో ఉంచుకుని చిరునవ్వుతో వృత్తి, ప్రవృత్తికి న్యాయం చేస్తూ బహుముఖ సేవకుడుగా, ఒక కళాకారుడిగా తనదైన శైలిలో సంఘ సేవ చేయటం హర్షించదగ్గ విషయం. భగవంతుడు సృష్టించిన ఏడు రోజులు నిరంతరం సేవకుడుగా సమాజ రుగ్మతలపై అలుపెరగని పోరాటం చేస్తూనే ఉంటారు. ఏదీ ఏమైనా కొండయ్య సేవలకు హ్యాట్సాఫ్... మన అందరం చెప్పాల్సిందే... ఆదివారం అనేక సేవా కార్యక్రమాలు తన ఇంటి వద్ద మధిర ఆజాద్ రోడ్డులో ప్రభుత్వాసుపత్రి వెనుక రోడ్డులో తన ఇంటి వద్ద బట్టల పంపిణీ, మొక్కల పంపిణీ, గృహోపకరణాలు పాతవి కదు పేదలకు పంపిణీ చేస్తుంటారు. మధిర అంబేద్కర్ సెంటర్‌లో బొమ్మలు అమలే రాజస్థా కుటుంబీకులకు వారికి సరిపడా బట్టలను తాను స్థాపించిన మహాత్మాగాంధీ ఓల్డ్ బ్యాంక్ ద్వారా అందచేశారు. ఈ కార్యక్రమంలో లంకా సేవా ఫౌండేషన్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.




# మంత్రి పొంగులేటికి శుభాకాంక్షల వెల్లువ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి నూతన సంవత్సర శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పాలేరు నియోజక వర్గ పర్యటన నిమిత్తం ఆదివారం హెలికాప్టర్‌లో విచ్చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కలెక్టరేట్‌లోని హెలీప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ సాదర స్వాగతం పలికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంత్రికి పుష్పగుచ్చాలు అందించి శాలువతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.





# 18న ఖమ్మంలో సిపిఐ భారీ బహిరంగ సభ

**ప్రజాపక్షం/కొణిజర్ల:** ఈ నెల18వ తారీఖున ఖమ్మంలో జరిగే సిపిఐ 100 ఏళ్ల వసంతాల భారీ బహిరంగ సభను కొణిజర్ల మండలం నుంచి బారీ ఎత్తున ప్రజలు జయప్రదం చేయా లని జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ జెడ్పిటిసి సభ్యులు దొండపాటి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పెద్దగోపతిలో పిడియాల శ్రీను అధ్యక్షతన జరిగిన సిపిఐ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఒకే ఎరువు రంగు, ఒకే కొడవలి గుర్తు వందేళ్ల నుండి ఎలాంటి మార్పు లేకుండా ఎంతో ఆదర్శంగా ఎన్నో పోరాటాలు త్యాగాలతోని అనేక విజయాలు సాధించి సిపిఐ దేశవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలతోని ఈ నెల18న ఖమ్మంలో కదం తొక్కుతూ సిపిఐ గొప్ప సభ జరుగుతుందని వరాఉ తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు పిట్టల రాంబాబు, పిడియాల శ్రీను, సిల్వరాజు, నాగేశ్వరరావు, చింతల మల్లయ్య, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# తెలుగు మహాసభల్లో మండల వాసిగా సన్మానం

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఆంధ్ర సారస్వత పరిషత్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన గుంటూరులో నిర్వహించిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం రామాపురం గ్రామానికి చెందిన గ్యార అమర్‌కు నిర్వాహ కులు ఘనంగా సన్మానం చేశారు. మూడవ ప్రపంచ తెలుగు మహాసభల్లో గ్యార అమర్ పాల్గొని శ్రీ జాషువా, కరుణశ్రీ వేదికపై తెలుగు తల్లికి సహస్ర కవిత నిరాజనం కవి సమ్మేళనంలో పాల్గొని ఓ మగువ కాస్త జాగ్రత్తగా మసలుకో అనే శీర్షికతో కవితను చదివి వినిపించి పలువురి ప్రశంసలు అందుకోవటం జరిగింది. తెలుగు కీర్తిని దశదిశల వ్యాప్తింపచేస్తున్న వారి కృషిని అభినందిస్తూ నిర్వాహకులు డాక్టర్ కొల్లూరు వారి చేతుల మీదుగా సన్మానం చేసి అభినందన పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగు బాష అభిమానులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.




# మండల, డివిజన్ కమిటీల వివరాలు అందించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జనవరి 15 నాటికి కాంగ్రెస్ పార్టీ మండల, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేసి వాటి వివరాలను అందించాలని ఖమ్మం జిల్లా కమిటీల అబ్జర్వర్ గాలి అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌కు విచ్చేసిన ఖమ్మం జిల్లా కమిటీల అబ్జర్వర్ అనిల్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుతు నూతి సత్యనారాయణ గౌడ్, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఏ కొండబాల కోటేశ్వర రావు లు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ ఈనెల ఎనిమిదిన గాంధీ భవన్‌లో ఎగ్జిక్యూటీవ్ మీటింగ్ ఉందని ఈలోపు జిల్లాలోని మంత్రులు, శాసనసభ్యులను సంప్రదించి జిల్లా కమిటీ వివరాలను టిపిసిసి అధ్యక్షులకు మహేష్‌కుమార్ గౌడ్‌కు అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈనెల 15 వరకు మండల, డివిజన్ కమిటీలను ఏర్పాటు చేసి వాటి వివరాలను అందించాలన్నారు. నూతనంగా ఏర్పాటైన కమిటీల ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెజండ్ల సాయికుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రం, చోటా బాబా, బాలాజీ నాయక్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



# మిర్చి పంట నష్టపరిచిన వారిపై చర్యలు తీసుకోండి

**-మిర్చి పంటను పరిశీలించిన బిఆర్ఎస్ నేతలు**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మిర్చి పంట నష్ట పరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో ఇటీవల ఎన్నికల్లో సర్పంచ్‌గా ఎన్నికైన కొంటెముక్కుల వెంకటేశ్వర్లు తండ్రి శ్రీనివాసరావుకు చెందిన వ్యవసాయ భూమిలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మిర్చి పంటపై కలుపు మందు చల్లారు. ఆదివారం బిఆర్ఎస్ నేతలు నష్టపోయిన పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలిచిందనే ఆక్రోశంతో పంట పొలాల్లో కలుపు మందు చల్లి పంటను నష్టపరిచారని, బిఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ తరుపున దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి నియోజక వర్గంలోనే ఇటువంటి చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఇటువంటి చిల్లర రాజకీయాలను మానుకోవాలని హెచ్చరించారు. మిర్చి పంటపై కలుపు మందు చల్లిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వ్యక్తిగత సహాయకులు రవికిరణ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు వీరునాయక్, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, మాజీ సర్పంచ్‌లు హరిప్రసాద్, మెంటెం రామారావు, చెరుకూరి ప్రదీప్, ఉప సర్పంచ్ ఉపేందర్, నాయకులు తాతా వెంకటేశ్వర్లు, దొంతు సత్యనారాయణ, నున్నా శ్రీనివాసరావు, భాస్కర్, నగేష్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# భారత గడ్డపై సిపిఐ నూరేళ్ల చరిత్ర

**-18న ఖమ్మంలో జరిగే సభను జయప్రదం చేయండి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/కరకగూడెం:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పుట్టి భారతగడ్డపై నూరేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సిపిఐ జిల్లా ప్రచార జాతా ఆదివారం కరకగూడెం మండలానికి చేరింది. కరకగూడెం మండలంలో కార్యక ర్తలు భారీగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానుద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ నూరేళ్ల చరిత్రలో అలుపెరగని పోరాటాలు చేసి అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల గుండెల్లో చిరస్థా యిగా నిలిచిపోయిందన్నారు. అనేక రాష్ట్రాల్లో సాయుధ పోరాటాలు, దేశ వ్యాప్తంగా సమరశీల పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. కమ్యూనిస్టులపై మతోన్మాద దాడులు పెరిగిపోయాయని, ఈ క్రమంలో ప్రజలు చైతన్యవంతులై ఈ మతోన్మాద ప్రభుత్వానికి బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఒక సుదీర్ఘమైన చరిత్ర ఉందని, ఈ జెండాని ఉమ్మడి జిల్లా ప్రజలు కడుపులోపి పెట్టుకుని ప్రేమించారని ఆయన అన్నారు. పోరా టాల ఖిల్లాగా పేరుపొందిన ఖమ్మం గడ్డపై దేశ వ్యాప్త భారత కమ్యూ నిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ జరుగుతుందని, అలాగే పులుసు బొంత ప్రాజెక్టుపై ప్రత్యేకంగా సిపిఐ పార్టీ సర్వతో ఇన్ని సంవత్సరాలనుండి పోరాటాలు చేస్తుందని తెలిపారు. దీనిపై ప్రత్యేకంగా ప్రభుత్వానికి విన్నపం చేస్తానని సిపిఐ పార్టీ తరఫున సాబీర్‌పాషా తెలిపారు. ఈ సభకు వేలాదిగా గ్రామ గ్రామాన సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కరకగూడెం మండల కార్యదర్శి వంగరి సతీష్, జిల్లా అధ్యక్షులు మొన్న లక్ష్మి కుమారి, రాష్ట్ర కార్యసభ్యులు కల్లూరు వెంకటేశ్వర్లు, బుడగం సతీష్, బోడ ముత్తయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా టెట్ పరీక్షలు : కలెక్టర్




**ప్రజాపక్షం/ భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్ ) ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలత్తకుండా మొదటి రోజు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్‌జితేష్‌వి. పాటిల్ తెలిపారు. అభ్యర్థుల భవిష్యత్‌తో ముడిపడి ఉన్నటువంటి కీలక పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందుగానే అన్ని ఏర్పాట్లను చేసిందన్నారు. జిల్లా టెట్ పరీక్షల నిర్వాహణ కోసం మొత్తం రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో రెండు సెషన్‌లకు కలిపి 200 మంది అభ్యర్థులు హాజరు కావాల్సిందన్నారు.కానీ మొదటి సెషన్‌కు 44 మంది, రెండవ సెషన్‌కు 38 మంది మాత్రమే హాజరయ్యారని చెప్పారు. కొత్తగూడెం అబ్దుల్ కలాం కళాశాలలో 200 మందికి గాను మొదటి సెషన్‌కు 60 మంది, రెండవ సెషన్‌కు 74 మంది పరీక్షలకు హాజరయ్యారని అన్నారు. మొత్తంగా రెండు కేంద్రాలలో 400 మందికి కేవలం 216 మంది పరీక్షలు రాశారని, 184 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. టెట్ పరీక్షల నిర్వాహణలో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు, కేంద్రాల సూపరింటెంట్లు, సిబ్బంది, పోలీస్ శాఖ అధికారుల సమన్వయంతో పరీక్షలు సజావుగా జరిగాయన్నారు. ఇదే విధంగా మిగిలిన వాటిని సైతం నిర్వహించటానికి అన్ని చర్యలు తీసుకొంటామన్నారు.

# భట్టిపై సిపిఎం నాయకుల ఆరోపణలు అర్ధరహితం



**ప్రజాపక్షం/ బోనకల్ :** తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కపై సిపిఎం నాయకులు ఆరోపణలు అర్ధరహితం, అవాస్తమని మధిర నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చేబ్రోలు రమ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రావినూతలలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ శాంతికాముకునిగా, అభివృద్ధి ప్రదాతగా భట్టివిక్రమార్కకి మంచి పేరుందని తెలిపారు. మీ పార్టీ ఉనికి కోసం, మీ వ్యక్తిగత స్వార్ధ ప్రయోజనాలు కోసం మీరు చేస్తున్న ఆరోపణలు మధిర నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ముఖ్యంగా విచక్షణ కోల్పోయి నందిని విక్రమార్కపై చేసిన ఆరోపణలు దమ్ముంటే రుజువు చేయాలని సవాల్ విసిరారు. హత్య రాజకీయాలకు ఆద్యులు ఎవరో నియోజకవర్గ ప్రజలకు తెలుసునని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే విధంగా సిపిఎం నాయకుల ప్రసంగాలు, ప్రదర్శనలు ఉన్నాయన్నారు. వందల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తుంటే ఓర్వలేక సిపిఎం నాయకులు ఉనికి కోసం ఆరాటపడుతున్నారని విమర్శించారు. ఇంకోసారి భట్టి, నందినిపై అసత్య ఆరోపణలు, అబద్దాలు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని, మీకు నేరుగా బుద్ధిచెప్పటానికి మహిళా కాంగ్రెస్ సిద్దంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి చిర్ర ఆదిలక్ష్మి , మండల అధ్యక్షురాలు అమరేసి ప్రమీల, కొమ్మినేని రాజ్యలక్ష్మి , ప్రభావతి, రావినూతల గ్రామశాఖ అధ్యక్షురాలు మరియమ్మ, వార్డు సభ్యులు తాళ్లూరి కర్ణమ్మ, కొత్తపల్లి రజిత పాల్గొన్నారు.

# దాసాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన ఆలయ కమిటీ**



**ప్రజాపక్షం/వైరా:** వైరా రిజర్వాయర్ వద్ద ఉన్న అతి పురాతన ప్రాముఖ్యత కలిగిన శ్రీదాసాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రత్యేక పూజలునిర్వహించారు. ఈ సందర్భంగా దాసాంజనేయ కమిటీ నిర్వాహకులు, అర్చకులు సాంప్రదాయ బద్దంగా వేదమంత్రాలతో రాందాస్‌నాయక్‌కు స్వాగం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం రిజర్వాయర్ ప్రక్కన ఉన్న దేవాలయానికి భక్తులు ఇబ్బందిపడకుండా వెళ్లే విధంగా సిసి రోడ్ల నిర్మాణానికి కోట ఇరూలపాయలు మజంఊరు చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులు రాజకీయ పార్టీల నాయకుల ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, మార్కెట్ చైర్మన్ గంగారావు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, ఫణితి సైదులు, శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, కట్ల సంతోష్, కొప్పురావూరి శబరి, మిట్టపల్లి శ్రీనివాసరావు, మాదినేని సునీత, అన్నపూర్ణ, చింతనిప్పు వెంకటయ్య, పెద్దిరెడ్డి రామ కృష్ణ, చావా శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

## నేడు బిఆర్ఎస్ సన్నాహక సమావేశం

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బిఆర్ఎస్ పార్టీ ఖమ్మం నియోజక వర్గ సన్నాహక సమావేశం సోమవారం జరగనుంది. ఈనెల ఏడున కేటిఆర్ ఖమ్మం పర్యటన సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్వగృహంలో ఉదయం 11 గంటలకు సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని మాజీ మంత్రి వ్యక్తిగత సహయకులు సిహెచ్ రవికిరణ్ కోరారు.

## ప్రశాంతంగా టెట్ పరీక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో టీచర్ ఎలిజిబులిటి టెస్ట్ (టెట్) రెండవ రోజు ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని తెలిపారు. జిల్లాలో మొత్తం తొమ్మిది కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో 1786 మందికి 1077 మంది అభ్యర్థులు హాజరైనట్లు, మధ్యాహ్నం సెషన్‌లో 2020 మందికి 1615 మంది అభ్యర్థులు హాజరైనట్లు డిఈవో తెలిపారు.

## ఘనంగా సత్య సాయి బాబా శతజయంతి



**ప్రజాపక్షం/కల్లూరు:** దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న శ్రీ సత్య సాయి బాబా వారి శతజయంతి ఉత్సవాలు సందర్భంగా ఆదివారం రథయాత్ర కల్లూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న శ్రీ సత్య సాయి ప్రేమ ప్ర వాహిని రథయాత్ర కల్లూరు మండలానికి చేరుకుంది. రథయాత్రను కల్లూరు మండలంలో ఎర్నాల అరుంధతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రథయాత్రకు కల్లూరు భక్తులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు అందుకున్నారు. ఈ రథయాత్ర జాతీయ రహదారిపై జరిగింది. అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దుమ్మాలపాటి సుధాకర్ తదితర భక్తులు పాల్గొన్నారు.

## ఇసుక లారీలు పట్టివేత



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆంధ్రా నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తెలంగాణలోకి ఇసుకను తరలిస్తున్న రెండు టిప్పర్లను వేంసూరు పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఎస్ఐ కవిత తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ కృష్ణానది వద్ద నుండి ఏపి 37 టిజే 2523, ఏపి 39 డబ్ల్యూబి 2998 నెంబర్లు గల రెండు లారీలలో ఇసుకను లోడు చేసుకుని ఎటువంటి అనుమతులు లేకుండా తెలంగాణలోని వేంసూరు చుట్టు ప్రక్కల గ్రామాలలో ఎక్కువ ధరకు అమ్ముటకు వచ్చుచుండగా నమ్మదగిన సమాచారం మేరకు వేంసూర్ ఎస్సై రెండు టిప్పర్ లారీలను పట్టుకొని లారీ డ్రైవర్లు, ఓనర్లు మీద కేసు నమోదు చేసిన్నట్లు తెలిపారు.ఎటువంటి అనుమతులు లేకుండా ఆంధ్ర నుండి అక్రమంగా ఇసుకను తీసుకువచ్చి అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కవిత హెచ్చరించారు.

## నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

**- విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించిన నిర్వహకులు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఆరెంపుల గ్రామంలో గల దర్గా వద్ద నేటి నుంచి రెండురోజుల పాటు ఉర్సు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు ఆదివారం విలేకరుల సమావేశంలో నిర్వాహకులు వెల్లడించారు. 5వ తేదీన గంధం కార్యక్రమం, 6న ఉర్సు మహోత్సవం, 7న దర్గాలో స్వామివారికి ఖందిల్ నిర్వహించనున్నారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. అలాగే ఖమ్మం బస్టాంట్ నుండి ఉర్సుకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగిందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరెంపుల సర్పంచ్ బండి సతీష్, దర్గాహ్ షరీఫ్ ఉత్తరాధికారులు మొహ్మద్ నసీర్, షేక్ దావుద్(ఉపసర్పంచ్), సభ్యులు మొహ్మద్ అర్ఫత్, అర్ఫన్, షేక్ అబ్బాస్, మొయినుద్దీన్, ఖాజా మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న పిల్లలకు కన్నతల్లి తర్వాత తల్లి అంగన్వాడీ టీచరే

**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న పిల్లలకు ఏకరూప దుస్తులను ఆదివారం ఆ గ్రామ సర్పంచ్ కాటేపల్లి శీరిష, ఉపసర్పంచ్ అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు చిన్నతనం నుండి స్కూల్‌కు అలవాటు కావాలనే ఉద్దేశ్యంతో అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాడ్డాయని, పిల్లలకు కన్నతల్లి తర్వాత అంగన్వాడీ టీచరే తల్లి లాగా చూసుకుని పిల్లలకు క్రమశిక్షణ నేర్పిస్తుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ, చక్కటి విద్య నేర్పించే విషయంలో అంగన్వాడీ టీచర్లు కీలక పాత్ర ఉంటుందని, దానిఅనుగుణంగా వారు వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కేంద్రం టీచర్, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన దుండేటి



**ప్రజాపక్షం/ తల్లాడ :** గొల్లగూడెం, కృష్ణాపురం గ్రామంలో మాజీ వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దుండేటి వీరారెడ్డి గ్రామాల్లో కొందరి కుటుంబీకులను ఆదివారం పరామర్శించారు. కాసిపోగు కృష్ణ ఇందిరమ్మ ఇల్లు పనులు ఎంతవరకు వచ్చిందని అని అడిగి తెలుసుకున్నారు. కొత్త కాలనీలో ఇనపనూరి నాగమణి ఇసనపల్లి మంగమ్మ ఏల్పుల మరియమ్మ ఇండ్లకు వెళ్లి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. మట్టి అవసరం ఉన్నందున తహశీల్దార్‌తో మాట్లాడి మట్టి పర్మిషన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. విలసాగరం లక్ష్మయ్య ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వీరారెడ్డి, కోడూరు రాము, వేమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, బి.ముత్తారెడ్డి, అప్పిరెడ్డి, దేవా, వెంకట్, పాపారావు, రాంబాబు, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# వందేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో ప్రజలతో మమేకం

**-శత వసంత ముగింపు సభను జయప్రదం చేద్దాం**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా**







**ప్రజాపక్షం/అశ్వాపురం :** ఈ వందేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో సిపిఐ పార్టీ ప్రజలతో మమేకమైందని, శత వసంత ముగింపు సభను జయప్రదం చేద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. సిపిఐ శత వసంత ఉత్సవాల్లో భాగంగా ప్రచార జాతాను మొండికుంట చేరుకుంది. మొండికుంట గ్రామంలో ఉన్నటువంటి కార్యకర్తలు భారీగా స్వాగతం పలికారు. ఈసందర్భంగా మొండికుంట సిపిఐ కార్యాలయం వద్ద సిపిఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు, కామ్రేడ్ కొల్లు శ్రీనివాస రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మొండికుంట, అశ్వాపురం మండల కేంద్రంలో ప్రచార జాతలో భాగంగా సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, పేదలు బడుగు బలహీన వర్గాల పక్షాన సిపిఐ నాటి నుండి నేటి వరకు అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. భారత స్వతంత్రాని కంటే ముందే ఆవిర్భవించిన కమ్యూనిస్టు పార్టీ స్వతంత్ర భారత వని కోసం ఎందరో కమ్యూనిస్టు యువ కిషోరాలు ప్రాణ తర్పణం చేశారాన్నారు. నేడు దేశంలో అమలవుతున్న అనేక చట్టాలు కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితమే అని, పోరాడి సాధించుకున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా పేర్లు మారుస్తుందని మండిపడ్డారు. ఈనెల 18న ఖమ్మం నగరంలో సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సభ జరగనుందని, ఈ సభకు దేశ నలుమూలల నుండి ప్రతినిధులు తరలివస్తున్నారని, ముగింపు సభ విజయవంతం చేసేందుకు పెద్ద ఎత్తున కదలాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, మువ్వా వెంకటేశ్వర రావు, ఏఐటియూసి జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, పేరాల శ్రీనివాసరావు, సిపిఐ మండల నాయకులు కొల్లు ఆశ కుమారి, పగిడిపల్లి జంపన్న, స్వరూప, దంతాల జగదీష్, ఈనపల్లి పవన్ సాయి, మేలపుర సురేందర్‌రెడ్డి, ముత్తబోయిన వెంకటేశ్వర్లు, కొండపర్తి ప్రసాద్, అక్కెనపల్లి నాగేంద్రబాబు, కంచర్ల రవి, సర్వ కృష్ణవేణి, వేపూరి శ్రీను, పురం సంతోష్, కంచర్ల మురళి, దారపు శ్రీను పాల్గొన్నారు.

# ఎర్రజెండా.. ప్రజల అండ



**-సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**





**ప్రజాపక్షం/పినపాక:** ఖమ్మంలో జనవరి 18వ తేదీన జరగబోయేటువంటి భారీ బహిరంగ సభకు పినపాక ప్రాంతం నుండి పెద్ద ఎత్తున కదలి రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా అన్నారు. ఈసందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజల పక్షాన పని చేయడానికి మరింత మద్దతు ఇక్కడి ప్రజల మద్దతు కోరారు. నిన్న చర్ల నుండి జరిగినటువంటి ప్రచార చాత్ర ఆదివారం పినపాక మండలానికి చేరుకుంది. ఈ పినపాక మండల ప్రాంతానికి కమ్యూనిస్టు పార్టీకి 60 సంవత్సరాల అనుబంధం ఉందని, ఈ ప్రాంతంలో అనేక మంది అమర జీవులు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఇవాళ రెండు మండలాలు మారిన పినపాక, కరకగూడెంలో గిరిజనులకు, గిరిజనేతరులకు ప్రజలకు రైతాంగానికి, పేదలకు ఎర్రజెండా నిలబడిందన్నారు. కొన్ని వందల గ్రామాలను నిర్మించిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదని, వేల, లక్షల ఎకరాల పేదలకు పోడు భూములు కానీ అటవీ భూములు, ప్రభుత్వ భూములు పంచి పినపాక ప్రాంతంలో ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలను భూములను సాధించిన చరిత్రని కొనియాడారు. మారుమూల గ్రామాలలో కరెంటు, రోడ్లు అదే విధంగా సాగునీటి సౌకర్యాలు అనేక చెక్ డ్యాములు, రిజర్వాయర్లు నిర్మించి సస్యశ్యామైనటువంటి ప్రాంతంగా ఈ ప్రాంతం నెలబెట్టడంలో ఎర్రజెండాది ప్రధానమైన ప్రాతని, భూస్వాముల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలకు సాగుతున్న బాధితులకు అండగా ఎర్రజెండా అనేక ప్రయత్నాలు చేసిందని గుర్తు చేశారు. అనేక కేసులను కూడా ఎదుర్కొని కమ్యూనిస్టు పార్టీ జనం పక్షాన నిలబడి పని చేసిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. సిపిఐ ఆవిర్భవించిన తర్వాతనే ఈ దేశ జాతీయోద్యమ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ అగ్రభాగంగా నిలబడిందని, మన తెలంగాణ రాష్ట్రం భారత దేశంలో అంతర్భాగంగా విలీనం కావడానికి సాగిన రైతాంత సాయుధ పోరాటానికి ఎర్రజెండా సిపిఐ నాయకత్వం వహించిందన్నారు. దున్నేవాడికి భూమి కావాలని నిదానంతో ఈ దేశంలో కోట్లాది ఎకరాల భూమిని పేదల చేతికి అందించిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమే అని తెలిపారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలబడేది మాత్రం ఎర్రజెండా అని గుర్తు చేశారు. పక్కనే ఉన్నటువంటి బిటిపిఎస్ నిర్మాణానికి సహకరించిందని ఇవాళ 400వందల మంది కార్మికుల పర్మినెంట్‌గా పని చేస్తున్నారంటే భారత కమ్యూనిస్టు పార్టీ చలువతో తప్ప మరొకటి కాదని అమరజీవి అయోధ్య నాటి రాష్ట్ర నాయకత్వం అందరిని కలుపుకొని పోరాడి నిర్వాసితులకు ఉద్యోగాలు వచ్చాయని గుర్తు చేశారు. సిఎస్ఆర్ నిధులు ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయవలసిన బాధ్యత బిటిపిఎస్ యాజమాన్యానికి ఉందని, పక్కనే ఉన్నటువంటి సీతారామ ప్రాజెక్ట్ ఏడున్నర లక్షల ఎకరాల ఆయకట్టుతో సాగుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, జిల్లా మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, జిల్లా సమితి సభ్యులు గడ్డ మనోహర చారి, పత్తిపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శది పద్మనాభ రాజు, ఏఐటియుసి మండల కార్యదర్శి కుమార్, మాజీ సర్పంచ్ వర్సా నరసింహారావు, మండల కార్యవర్గ సభ్యులు గురజాల సుబ్రహ్మణ్యం, పొనగంటి పురుషోత్తం, తంగళ్ళపల్లి ఎంకన్న, కొప్పుల రవణ, బొగ్గం ధర్మారావు, కారం రమేష్, బగ్గం దుర్గ, బత్తుల అనిల్‌రెడ్డి, మోడెం గణేష్, యాతల కాసు, నరసయ్య, గడ్డం వెంకటాచారి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరోపణ మేరకే వార్త ప్రచురణ

**ప్రజాపక్షం/ మధిర :** బాధితుల ఆరోపణ మేరకే 'రెవెన్యూలో అవినీతి లీలలు' పేరిట వార్త ప్రచురించడం జరిగింది. మధిరలో మూడవ రైల్వే లైన్‌కు సంబంధించి భూ నిర్వాసితుడు బిల్లకంటి వెంకటేశ్వర్లు ఇచ్చిన సమాచారం మేరకు వార్తను ప్రచురించడం జరిగింది. ఆయన ఆరోపణల ఆధారంగానే వార్తను ప్రచురించడం జరిగింది. కానీ రెవెన్యూ అధికారులపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి ఏ దురుద్దేశం లేదు. ఆర్డివో, మధిర తహసీల్దార్ కార్యాలయంలో అవినీతికి సంబంధించి తమ వద్ద ఎటువంటి సమాచారం లేదు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో వైరా పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫనితి సైదులు వినతితో ఏడో వార్డులో సరిపూడి కోటేశ్వరరావు ఇంటి వద్ద నుంచి బండారు శ్రీను ఇంటి వరకు సిసి రోడ్డు డ్రైనేజీ నిర్మాణానికి వైరా ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఫనితి సైదులు వైరా ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, కాంగ్రెస్ పార్టీ వైరా మండల పట్టణ అధ్యక్షులు శీలం నర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, ఏఎంసి చైర్మన్ బోళ్ళ గంగారావు, పోటు మధు, పైడిపల్లి శ్రీను, చెరుకూరి శ్రీను, సరిపూడి కోటేశ్వరరావు, చెరుకూరి గోపాలరావు, వీరంశెట్టి సీతారాములు, మందూరు రవి, ఫణితి వెంకటేశ్వర్లు, ఫణితి నాగార్జున, ఫనితి అశోక్, ఫణితి పుల్లయ్య, కంద్రా శ్రీను, సింగ్ సుధాకర్, బండారు ఉపేందర్, ఫణితి ఉదయ్‌సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి మండలంలో గుప్పు మంటున్న నాటుసారా



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలంలో కోక్కతండలో నేలకొండపల్లి ఎక్సైజ్ శాఖ పోలీసులు నల్లబెల్లం నాటు సారాయి పట్టికను పట్టుకున్నట్లు నేలకొండపల్లి ఎస్ఐ ఎన్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ కమీషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఖమ్మం జి జనార్ధనరెడ్డి, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి జి నాగేందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 3వ తేదీన రాత్రి నాయకన్‌గూడెం, కోక్యాతండా గ్రామాలలో నిర్వహించిన తనిఖీలలో ముగ్గురు వ్యక్తుల నుండి సుమారు 4 క్వింటాల నల్లబెల్లం, 20 కేజీల పటిక, 10 లీటర్ల నాటు సారాయి, 1 ఆటో రిజిస్ట్రేషన్ నెంబర్ టిఎస్ 04 యూబి 3948 ని స్వాధీన పరుచుకోవడం జరిగిందన్నారు. పట్టుబడిన వ్యక్తులు వంకయాల జనార్ధన్ నాయకన్‌గూడెం, బానోత్ నరేష్ కోక్యాతండా గ్రామం, నాంపల్లి ధనలక్ష్మి నాయకన్‌గూడెం గ్రామం వీరు కూసుమంచి మండలానికి చెందిన వారిని తెలిపారు. వీరు నాయకన్‌గూడెం నుండి కోక్యా తండాకు రవాణా చేస్తున్న క్రమంలో కోక్యా తండా గ్రామంలో పట్టుబడ్డారని, సీజ్ చేసిన వస్తువుల విలువల సుమారు రెండు లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ అధికారులు ఎస్ రమేష్, టి లత, సిబ్బంది పి శ్రీనివాస్‌రావు, జె రామారావు, ఎం లాలు, ఎస్ బలరాం, ఎన్ వినీత్, డి సునీత, పి లక్ష్మి , వి సంపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## వెనిజులపై అమెరికా సామ్రాజ్యవాద దాడులు తక్షణమే నిలిపివేయాలి



**ప్రజాపక్షం/కామేపల్లి:** వెనిజులపై అమెరికా సామ్రాజ్యవాద దాడులు తక్షణమే నిలిపివేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, పొతినేని సుదర్శన్‌రావులు అన్నారు. ఆదివారం సిపిఎం వైరా డివిజన్ విస్తృత స్థాయి సమావేశం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ అధ్యక్షతన కామేపల్లి మండలం జాస్తిపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముందుగా గ్రామంలోని మల్లెంపల్లి శ్రీనివాసరావు స్థూపం వద్ద నివాళులు అర్పించారు. అనంతరం వెనుజులపై అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న దాడులను నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ వెనుజులపై అమెరికా సామ్రాజ్యవాదం చేపడుతున్న యుద్ధోన్మాద చర్యలు ప్రపంచ శాంతికి తీవ్రమైన ముప్పుగా మారాయని అన్నారు. ఈ దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ ప్రజా సమస్యల ఆధారంగా ఉద్యమాలు నిర్మించి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే సమావేశంలో సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం మాట్లాడుతూ పార్టీ పిలుపునిచ్చిన ఇంటింటికి సిపిఎం కార్యక్రమాన్ని డివిజన్ వ్యాప్తంగా విజయవంతం చేయాలని కార్యకర్తలను పిలుపునిచ్చారు. ఈసమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు రమణ, తాళ్లపల్లి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, సుంకర సుధాకర్, దొంతిబోయిన నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, మచ్చా మణి, కె నరేంద్ర, అంబటి శ్రీనివాస్‌రెడ్డి, బాదవత్ శ్రీనివాస్, అష్టగుర్తి, సింగరాయపాలెం సర్పంచ్‌లు కంచర్ల అనిత, వేము నాగరాజు, ఉపసరపంచ్‌లో వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.